క్లుప్తంగా

నేడు సీఎం వైఎస్ జగన్ విజయవాడ పర్యటన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న భారత రత్న లలమౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్, జేసీ పి.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్‌లతో కలిసి పరిశీలించారు. ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ ఉదయం 10.20 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంకు చేరుకుంటారని తెలిపారు. మౌలానా అబుల్ కలాం జయంతి సందర్భంగా నిర్వహించే మైనార్టీస్ వెల్ఫేర్ డే, నేషనల్ ఎడ్యుకేషన్ డే వేడుకల్లో పాల్గొని విశిష్ట ప్రతిభ కనబర్చిన వారికి పురస్కారాలు అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పాతపాయకాపురం, నూజివీడు మెయిన్ రోడ్డు డీమార్ట్ వరకు, కండ్రిక డ్రైనేజ్ ప్లాంట్ చుట్టు పక్కల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. వినియోగదార్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మధురానగర్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా మధురానగర్ సెక్షన్ నేతాజీకాలనీ, దేవీనగర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీవీ నరసరాజురోడ్డు, దేవీనగర్ ఒకటో రోడ్డు నుంచి ఎనిమిదో రోడ్డు వరకు, నేతాజీకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

గాంధీనగర్‌లో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):గాంధీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ వినియోగిస్తున్న గృహాలు, వాణిజ్య సముదాయాల్లో విజిలెన్స్ అధికారులు మొత్తం 42 బృందాలుగా ఏర్పడి 2776 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ విభాగము ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.కమలాకుమారి 144 సర్వీసులకు అదనపు లోడు చార్జీలు కింద రూ.4.30లక్షల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీ సుధాకర్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బసవరాజు, బి.నవీన్‌కుమార్, టి.రవిచంద్ర, కోటేశ్వరరావు, గాంధీనగర్ ఏఈ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సినీ గీతాలు



విజయవాడ కల్చరల్: దామోదర జానపదం, గీతాంజలి మ్యూజికల్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన జానపద, సినీ గీతాలు ఆకట్టుకున్నాయి. అంతర్జాతీయ గాయకుడు దామోదర గణపతిరావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు రాగల లచ్చుమ్మ, అల్లుడా గారెలొండేదా, కొండకోన లోన తిరిగేటి మామయ్యో, నేలమ్మా నీలమ్మ తదితర గీతాలను భామిని సుజాత, మధురిమ ఆలపించారు. డాక్టర్ జయంతిచక్రవర్తి ఆధ్వర్యంలో రూపాశ్రీ, సిరిమోక్ష, సురేష్, రుగ్వేదం సిస్టర్స్ తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. గాయకులు దామోదర గణపతిరావు మాట్లాడుతూ జానపదం– జన పదమని ఆ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలు పాటల్లో నిక్షిప్తమై ఉంటాయన్నారు. వంగపండు ప్రసాదరావు, గద్దర్‌లాంటి మహనీయులు పాటతో ప్రజల్లో చైతన్యం కల్గించినట్లు ఆయన తెలిపారు.

ఇజ్రాయిల్ దాడులు ఖండిస్తూ ర్యాలీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ ముస్లిం మతపెద్దలు, యువకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. భవానీపురం 41వ డివిజన్ పరిధిలోని దర్గా నుంచి ప్రారంభమైన ర్యాలీ తిరిగి దర్గాకు చేరుకుంది. ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ర్యాలీలో పాల్గొన్న మత పెద్దలు దాడిని తీవ్రంగా ఖండించారు. దాడులపై అంతర్జాతీయ సమాజం స్పందించాలన్నారు. 41వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ మాట్లాడుతూ నెల రోజులుగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తోందన్నారు. దాడుల్లో ఎంతో మంది బలైపోయారని, పాలస్తీనాలో శాంతి నెల్కొల్పాలని పేర్కొన్నారు. ర్యాలీలో దర్గా కమిటీ ప్రెసిడెంట్ ముస్తాక్, పెద్దలు రెహమాన్, ఇషాక్‌బాజీ, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ సారథిగా ముందుకు తీసుకెళ్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నిండు మనసుతో ఆశీర్వదించాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 28వ డివిజన్ 202వ వార్డు సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంచార్జి కనపర్తి కొండలరావుతో కలిసి శుక్రవారం ఆయన పాల్గొన్నారు. తొలుత ఫుడ్ జంక్షన్ వద్ద మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సచివాలయ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లారు. సచివాలయ పరిధిలో 'సంక్షేమ పథకాల బోర్డు'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేదల పక్షపాతి అని కొనియాడారు. సుదీర్ఘ పాదయాత్రలో పేదల కష్టాలు చూసి ఆయన ప్రకటించిన నవరత్నాలు నవశకానికి నాంది పలికాయని తెలిపారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తోందని, సామాజిక న్యాయంలో ఆయన దేశంలోనే ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. సచివాలయ పరిధిలో 3,506 మందికి రూ. 9.73 కోట్లు డీబీటీ ద్వారా లబ్ధి చేకూరినట్లు వెల్లడించారు. అలాగే నాన్ డీబీటీ ద్వారా మరో 1,476 మందికి రూ. 3.13 కోట్లు మొత్తంగా 4,982 మందికి రూ. 12.86 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. ప్రతి కుటుంబానికి ఏదోక రూపంలో మేలు చేకూరుస్తూ ముందుకు సాగుతున్న సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, రానున్న ఎన్నికల్లో మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మాల్యాద్రి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు శర్వాణి మూర్తి, జానారెడ్డి, నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

26వ డివిజన్‌లో....

26వ డివిజన్ 30వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంచార్జి అంగిరేకుల నాగేశ్వరరావు గొల్లభామతో కలిసి శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును మల్లాది విష్ణు వివరించారు. 30వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో 2,059 మందికి రూ. 5.96 కోట్లు డీబీటీ ద్వారా లబ్ధి చేకూర్చినట్లు ఆయన వెల్లడించారు. అలాగే నాన్ డీబీటీ ద్వారా 655 మందికి రూ.1.77 కోట్లు.. మొత్తంగా 2,714 మందికి రూ. 7.74 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును మరువరాదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మాల్యాద్రి, వైఎస్సార్ సీపీ డివిజన్ కో-ఆర్డినేటర్ కె.నాగాంజనేయులు, పి.వంశీ, నాయకులు శనగశెట్టి హరిబాబు, కంభం కొండలరావు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలే అభివృద్ధికి సూచికలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రోజు రోజుకు అంచలంచెలుగా ఎదుగుతున్న పేద ప్రజల జీవన ప్రమాణాలే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి సూచికలని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ 58వ డివిజన్‌లోని 239–260వ వార్డు సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన ఆంధ్రప్రభ కాలనీ, వశిష్ట కాలనీ, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. 239 గడపలను సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వీక్షించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజలు చెప్పిన సమస్యల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. వారి నుండి సలహాలు, అర్జీలు స్వీకరించారు. గత నాలుగున్నరేళ్లలో 260వ వార్డు సచివాలయ పరిధిలో రూ. 3.26 కోట్ల సంక్షేమాన్ని అందజేయగా 239వ వార్డు సచివాలయ పరిధిలో రూ. 5.18 కోట్ల నగదును వివిధ పథకాల రూపంలో లబ్ధిదారుల ఖాతాలలో జమ చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

టీడీపీ మేనిఫెస్టో ఏమైంది?

2014–19 మధ్య ఇచ్చిన మేనిఫెస్టో ఎక్కడుందో టీడీపీ-జనసేన నాయకులకు కూడా తెలియదని మల్లాది విష్ణు విమర్శించారు. దేశ చరిత్రలో మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల్లో 99.50 శాతం నెరవేర్చిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో సుస్థిరంగా, చెరగని ముద్ర వేసుకుంటున్నాయని తెలిపారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 11న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగే మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, ఉమ్మడి వెంకట్రావు, శర్మ, గోపాల్‌రెడ్డి, వసంత్, వజీర్, తోపుల వరలక్ష్మి, శోభన్, మహేశ్వరి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

విద్యతోపాటు నైపుణ్యాలు పెంచుకోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు సిలబస్‌తో పాటు, వివిధ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని విజయవాడ సబ్‌కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ మీట్ బ్రెయిన్ స్ట్రోమర్స్ 2కే233 శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. కళాశాల మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ చదువు మార్కుల కోసమే కాకుండా, విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు నేర్చుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నలంద యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో క్లౌడ్ అండ్ సెక్యూరిటీ ఆర్కిటెక్ట్ జి.గోపినాథ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ, మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ వై.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్విజ్, పోస్టర్ మేకింగ్, బిజినెస్ ప్లాన్, మైమ్‌షో, ఇన్‌స్టా రీల్, ప్రాడక్ట్ లాంచింగ్, యంగ్ మేనేజర్, పర్సనాలిటీ కాంటెస్ట్, స్పాట్ ఫొటోగ్రఫీ , గ్రూప్ డ్యాన్స్ వంటి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ అదితిసింగ్‌కు మెమొంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ

పేదల ఆరోగ్యమే లక్ష్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. 30వ డివిజన్ జీవీఆర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంను ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వైద్య సిబ్బంది వచ్చి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు అందజేయడం పట్ల ప్రజలు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారన్నారు. శిబిరంలో సుమారు 672 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

600 మందికి వైద్య పరీక్షలు

29వ డివిజన్‌లో మధురానగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంను ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా వైద్యసేవలను పరిశీలించారు. సుమారు 600 మంది వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు తీసుకున్నారు.

26వ డివిజన్‌లో....

26వ డివిజన్ మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంను ఎమ్మెల్యే మల్లాది విష్ణు వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి అంగిరేకుల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. సుమారు 500 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు.



29వ డివిజన్‌లో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మల్లాది విష్ణు

విలేజి కండ్రికలో....

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రిక 280వ వార్డు సచివాలయం ఎంపీయూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే విష్ణు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలను అందిస్తోందన్నారు. దీర్ఘకాల వ్యాధులకు కూడా చికిత్స అందించడం, పెద్ద జబ్బులైతే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు పంపి వైద్యం చేయడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. అనంతరం రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, సొసైటీ చైర్మన్ ఎం.రవీంద్రరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమ దినోత్సవం జయప్రదం చేయండి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నేడు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జరగనున్న మైనార్టీ సంక్షేమ దినోత్సవంలో ముస్లిం మైనార్టీలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. మైనార్టీ సంక్షేమానికి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అన్ని అంశాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి చూపారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని ముస్లీం మైనార్టీలంతా అండగా నిలుస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకలకు ముస్లిం సోదర, సోదరీమణులంతా కలిసికట్టుగా హాజరై వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

26న రజక ఆత్మగౌరవ సభ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ రజక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలోని మైదానంలో రజక ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు జేఏసీ కన్వీనర్ అంజిబాబు తెలిపారు. శుక్రవారం విజయవాడ ఐలాపురం హోటల్‌లో జేఏసీ సమావేశం జరిగింది. దీనిలో రజక ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంజిబాబు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని రజక సోదరులు ఆత్మగౌరవ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చాకలి ఐలమ్మ కమిటీ అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఇన్ఫర్మేషన్ పార్కు పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్‌లోని పూర్వపు డంపింగ్‌యార్డు స్థలంలో జరుగుతున్న ఇన్ఫర్మేషన్ పార్కు పనులను శుక్రవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. అక్కడ ఆధునికీకరణ పనులు పరిశీలించి మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కులో ఆడిటోరియం పరిశీలించి మరింత మెరుగ్గా ఉంచడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఏర్పాటు చేస్తున్న గ్రీనరీని పరిశీలించి హెర్బల్, జోడైక్ గార్డెన్ సంబంధించిన మొక్కలు నాటాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్‌పై అధికారులు డిజైన్లను ప్రదర్శించగా వాటిని మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఉద్యానవన విభాగం అధికారి శ్రీనివాసు, , శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



డిజైన్లు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వ్యక్తి అనుమానాస్పద మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ చదలవాడ సురేష్(44) మృతి చెందగా పోలీసులకు అందిన సమాచారం మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, ఒంగోలు జిల్లా మద్దిపాలెం సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న మృతుడు చదలవాడ సురేష్ గత మూడు సంవత్సరాలుగా భార్యతో విడిపోయి, ప్రశాంతినగర్‌కు చెందిన మహిళతో ఉంటున్నాడు. ఈ నెల 5న సురేష్ ప్రశాంతినగర్ వచ్చాడు. 10వ తేదీన మహిళ సురేష్ తల్లికి ఫోన్ చేసి సురేష్‌కు సీరియస్‌గా ఉందని, చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రిలో చేర్పినట్టు తెలిపింది. బంధువులు వచ్చి చూడగా ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. సురేష్ మరదలు చదలవాడ సుభాషిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నిదానాల్లో అన్నదానం మిన్న


మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్నిదానాల్లో అన్నదానం మిన్న అని ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ వి.జగన్‌మోహనరావు అన్నారు. ఆంధ్రాబ్యాంక్ ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోచినంతలో తోటివారికి సాయం చేయడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బీఏ రాజు, నాయకులు ఎంవీఎస్ శర్మ, ఏవీ రమణ, ఎల్‌వీఎస్ కామేశ్వరరావు, కె. శివప్రసాద్, డాక్టర్ బ్రహ్మదేశం సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్, ఏడుకొండలు, కె.రాము పాల్గొన్నారు.



అన్నదానం కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ యూనియన్ సభ్యులు

ప్రజలందరికీ ఆయుర్వేద వైద్యం

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలందరికీ ఆయుర్వేద వైద్యం పట్ల నెల రోజులుగా అవగాహన కల్పించామని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల రోజుల పాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ధన్వంతరి పూజా కార్యక్రమంతో శుక్రవారం ముగిశాయని ఏడీ వెంకటేశ్వర్లు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆయుర్వేదం పట్ల అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమాల్లో పరిశోధనాధికారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

ఎస్ఆర్ఆర్‌లో అతిథి ఉపన్యాసం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో 'డాటాడ్రివెన్ బయాలజీ-ఏ బయో ఇన్ఫర్మేటిక్' అనే అంశంపై అతిథి ఉపన్యాసం శుక్రవారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ యూజీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటప్రసూజ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బయోటెక్నాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీ బ్రౌన్ జయంతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా సేవకుడు సీపీ బ్రౌన్ జయంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శైలజ మాట్లాడుతూ ఆంగ్లేయుడైన బ్రౌన్ ఉద్యోగ నిమిత్తం తెలుగు భాషను నేర్చుకోవడంతో పాటు తెలుగు భాషకు ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మృతివనం పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్‌మైదాన్‌లో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు 95 శాతం పూర్తయ్యాయని, ఈ నెల 26న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. శుక్రవారం స్మృతివనం నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రస్తుతం సీలింగ్, ప్లాస్టింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. సందర్శకుల సౌకర్యార్థం భారీస్థాయిలో పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంగణం ఆకర్షణీయమైన వివిధ రకరకాల పూలుతో కనువిందు చేస్తుందని పేర్కొన్నారు.

అలరిస్తున్న సంగీత మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో 30 వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సంగీత మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. హైదరాబాద్ సోదరులుగా ప్రసిద్ధిచెందిన డి.రాఘవాచారి, డి.శేషాచారి శుక్రవారం నిర్వహించిన కచేరి ఆద్యంతం సంగీత ప్రియులను అలరించింది. నీవెవరివో, ఎవరని నిర్ణయించేదిరా, హరియువతీ హైమవతి తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని, మృదంగంపై కోటిపల్లి రమేష్, ఘటంపై ఎం. హరిబాబు సహకరించారు. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, దండమూడి సుమతీ రామ్మోహనరావు, మోదుమూడి సుధాకర్,అంజనా సుధాకర్ పాల్గొన్నారు. సద్గురు సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ మాట్లాడుతూ శనివారంతో ఉత్సవాలు ముగుస్తాయని మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోనరావుకు సంగీత సద్గురు విద్వన్‌మణి బిరుదుతో సత్కరిస్తున్నామన్నారు. కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం అధ్యాపకుడు డాక్టర్ చింతారవి బాలకృష్ణ బృందం భక్తప్రహ్లాద నృత్యరూపకం ప్రదర్శిస్తారని తెలిపారు.



సంగీత కచేరి నిర్వహిస్తున్న హైదరాబాద్ సోదరులు డీ రాఘవాచారి, డీ శేషాచారి

చంద్రబాబు, పవన్ వంటి దుష్టశక్తులను రాష్ట్రం నుంచి తరిమివేయాలి

ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరాజు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తుంటే ప్రతిపక్ష నేతలు ఇష్టానుసారం విమర్శలు చేస్తున్నారని ఎస్సీ కమిషన్ సభ్యుడు కె బసవరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు , లోకేష్, పవన్ కల్యాణ్ వంటి దుష్ట శక్తులను రాష్ట్రం నుంచి తరిమేయాలన్నారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను రాజ్యాంగ పదవిలో ఉన్నందున రాజకీయ విమర్శలు చేయడం లేదని. తనకు పదవి ఇచ్చి ఆదరించిన సీఎం వైఎస్ జగన్‌ను విమర్శిస్తుంటే తట్టుకోలేకపోతున్నానన్నారు. జగన్‌ను ఓడించేందుకు కలిసికట్టుగా పనిచేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, వారికి వత్తాసు పలుకుతున్న కొన్ని మీడియా సంస్థలు, దళిత ద్రోహులు జడ శ్రవణ్, మహాసేన రాజేష్‌ల పైనా తాను పోరాడతానన్నారు.

మంటల్లో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఇంట్లో మంటలు వ్యాపించడంతో తోటకూర శంకర్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటనపై సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని సీతారామపురం, ఇజ్జాడ అప్పాలనాయుడు వీధిలో పెరుమాళ్ల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలసి నివాసముంటున్నాడు. ఆ ఇంట్లో పైపోర్షన్‌లో వారు ఉండగా కింది పోర్షన్‌లోని మూడు గదుల్లో చీరల వ్యాపారం చేసే బాబు, రవి, తోటకూర శంకర్‌లు గత ఎనిమిది నెలలుగా అద్దెకు ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో తోటకూర శంకర్ ఉంటున్న గదిలో నుంచి మంటలు, పొగలు రావడంతో ఇంటి ఓనర్ శ్రీనివాసరావు కొడుకు ఫోన్ చేయగా ఆయన వెంటనే వచ్చి స్థానికుల సాయంతో తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఆ మంటల్లో కాలిన గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న తోటకూర శంకర్‌ను నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డాక్టర్‌లు పరిశీలించి 80 శాతం కాలిన గాయాలతో ఉన్నాడని పరిస్థితి విషయంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీనిపై సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.